క్లుప్తంగా

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె నోటీసు



ఎంఈఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

బలిజిపేట: తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ వచ్చే నెల 20వ తేదీ నుంచి సమ్మె నిర్వహిస్తున్నామని తెలుపుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె నోటీసును ఎంఈఓ-1సామల సింహాచలంకు శనివారం అందించారు. సమాన పనికి సమాన వేతనం, ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, తక్షణమే ఎంటీఎస్ అమలు చేయాలని, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లను రెగ్యులర్ చేయాలని, ప్రతీ నెల 1వ తేదీకి జీతం చెల్లించాలనే తదితర డిమాండ్ల పరిష్కారం కోరుతూ సమ్మె నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎంఆర్‌సీ సిబ్బంది భద్ర, మధు, వైకుంఠం, శారద, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో సత్ఫలితాలు సాధించాలి



టెన్త్ విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈఓ

బలిజిపేట: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమంగా రాణించాలని ఎంఈఓ 1 సామల సింహాచలం విద్యార్థులకు సూచించారు. అరసాడ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్షలపై చక్కని ప్రణాళిక రూపొందించుకొని ముందుకు సాగాలన్నారు. పదో తరగతి విద్యార్థి దశకు తొలి మెట్టు అని అన్నారు. దీన్ని గుర్తించి ఉపాధ్యాయులు కూడా తగు బోధన చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన ఏఓ



ఉపముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఏఓ సింహాచలం

సాలూరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రి ఏఓగా బాధ్యతలు స్వీకరించిన సింహాచలం ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరను మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ, నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సిబ్బంది రత్న కుమారి, తదితరులు ఉన్నారు.

హక్కులు కాపాడుకోవాలి..



ర్యాలీ నిర్వహిస్తున్న వెలుగు సిబ్బంది, అధికారులు

మక్కువ: జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా వెలుగు మహిళా సమైక్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హక్కులు కాపాడుకోవాలంటూ మహిళలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ. సూర్యనారాయణ, ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ, వెలుగు ఏపీఎం బలగ సన్నిబాబు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు

దరఖాస్తుల పరిశీలన

బాడంగి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు దరఖాస్తులను తహసీల్దార్ అజురఫీ జాన్ శనివారం పరిశీలించారు. ఓటరు ముసాయిదా జాబితా విడుదల అనంతరం బీఎల్‌వో(బూత్ లెవల్ ఆఫీసర్)లు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద కొత్త ఓటర్ల నమోదు చేపట్టడంతో పాటు పాత ఓటరు జాబితాలోని ఓటర్ల వివరాలను పరిశీలించారు. జాబితాలోని ప్రతీ ఓటరు గ్రామంలో ఉన్నారా లేదా అనే విషయం క్షుణ్ణంగా తెలుసుకున్నారు. మృతుల ఓట్లను జాబితా నుంచి తొలగించారు. కొత్తగా ఓటుహక్కు కోసం యువత సమర్పించిన దరఖాస్తులను స్వీకరించారు. వీటన్నింటినీ పరిశీలించిన తహసీల్దార్ వివరాల సేకరణ పక్కాగా చేపట్టారా లేదా అనే విషయం గమనించి, పలు సూచనలు చేశారు.

ఆహారపొట్లాల పంపిణీ

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ, ప్రేమసమాజం, పోలవానివలస, రామభద్రపురం మండలంలోని ఆరికతోట గ్రామాల్లోని పేదలకు బొబ్బిలి మదరసా పాఠశాల ప్రిన్సిపాల్ హఫీజ్ అబుల్ కలాం ఆధ్వర్యంలో శనివారం ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. సమాజ సేవలో భాగంగా వాహనం ద్వారా ప్రతీ ప్రాంతానికి వెళ్లి, దాదాపు 300 మందికి పైగా పేదలకు ఆహారం అందించినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ పాల్గొన్నారు.

జగనన్న మాటిస్తే.. చేస్తారంతే...

- ఎమ్మెల్యే జోగారావు
- 291 మంది నిరుపేదలకు 52.25 ఎకరాల భూ పంపిణీ



భూమి హక్కు పత్రాల పంపిణీలో లబ్ధిదారులతో ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: జగనన్న మాటిస్తే.. చేస్తారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పేదలకు భూముల పంపిణీ, వాటిపై పూర్తి హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేయడం హర్షణీయమని అన్నారు. ఇంతటి సహకారం చేసిన జగనన్నకు రుణం తీర్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో భూమి లేని నిరుపేదలకు తహసీల్దార్ ఎన్వీ రమణ ఆధ్వర్యంలో భూ హక్కు పత్రాల వన్ బీ కాపీ, భూమి స్కెచ్‌తో పాటు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సందేశం కాపీలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పాపమ్మవలస, నిడగల్లు, సూరంపేట, నీలకంతాపురం గ్రామాల్లో సాగు భూమి లేని రైతులను రెవెన్యూ అధికారులు గుర్తించిన పేదలు 291 మందికి 52.25 ఎకరాల భూమిని పంపిణీ చేశారు. మరో 12 ఎకరాల భూమిని త్వరలో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జగనన్న ప్రభుత్వం ఇచ్చిన హామీలను శతశాతం అమలు చేయడానికి కృతనిశ్చయంతో ఉందన్నారు. సంక్షేమ పథకాల అమల్లో ప్రజలందరికీ న్యాయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మామిడి బాబ్జి, పార్టీ సీనియర్ నాయకులు బి.శ్రీరాములునాయుడు, వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, ఎంపీటీసీ బి.కుసుమ, పార్టీ మండల నాయకులు బి.ముకుందరావు, సీహెచ్ కృష్ణ, జి.రమేష్, సీహెచ్ సాంబన్నదొర, ఆర్‌వీ పార్థసారధి, కె.శ్రీనివాసరావు, ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మనసున్న ముఖ్యమంత్రి జగన్



పేదలకు భూ పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: నిరుపేదలకు ఇచ్చిన మాట ప్రకారం భూములు పంపిణీ చేస్తున్న మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం మండలం జిల్లేడువలస గ్రామంలో నిరుపేద రైతులకు శనివారం అతుకుబడి భూముల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మండలంలోని 8 రెవెన్యూ గ్రామాలకు సంబంధించిన 70మంది లబ్ధిదారులకు 99.56 ఎకరాలకు సంబంధించి భూపట్టాలను పంపిణీ చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలను ఆర్థికంగా మెరుగైన స్థితికి చేర్చడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ భూ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. మండల పరిధిలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి ఇప్పటికే పంపిణీకి అసైన్‌మెంట్ కమిటీల ఆమోదం తీసుకున్న అనంతరం అర్హులందరికీ డీపట్టా భూములను అందజేశామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బంకూరు రవికుమార్, నాయకులు బలగ నాగేశ్వరరావు, మజ్జి శేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బి రమేష్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు బీమవరపు కృష్ణ, తహసీల్దార్ ఎస్వీ రమణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ జానకిరాం

సీతానగరం: ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న కాలనీలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ జానకిరాం అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 'ఆవాస్ దీవాస్ ఆవాస్ సప్తాహ్' నినాదంతో జగనన్న కాలనీలను ఇంజినీరింగ్ సిబ్బందితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చాలనే సంకల్పంతో ఇల్లు నిర్మాణానికి అవసరమైన స్థలం, నిర్మాణానికి ఆర్థిక సాయం, రాయితీపై ముడి సరుకులు సమకూర్చుతున్నా పలుచోట్ల అసంపూర్తిగా ఉండడం దురదృష్టకరమన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన వారికి బిల్లులు పెట్టడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులంతా అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేసి సొంతింటి కల నెరవేర్చుకోవాలని కోరారు.

కార్యక్రమంలో సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు సంతోష్ కుమార్, గృహనిర్మాణ వర్క్ ఇన్‌స్పెక్టర్లు నాయుడు, కృష్ణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బోగస్ కులధ్రువీకరణ పత్రాలపై విచారణ

సీతంపేట: ఎస్టీ బోగస్ కులధ్రువీకరణ పత్రాలపై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి శనివార విచారణ చేశారు. ఈ మేరకు డీఎల్‌ఏసీ సమావేశం నిర్వహించారు. ఫిర్యాదుదారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని విచారించారు. వారి వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించారు. మరిన్ని ధ్రువపత్రాలు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో రోసిరెడ్డి, డీడీ మంగవేణి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం



గోపాలరావును సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

గుమ్మలక్ష్మీపురం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్‌పై 'కనిపించే దేవునివో అంబేడ్కరా' అంటూ సాగే గీతాన్ని రాసిన గుమ్మలక్ష్మీపురం మండలం కేడీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నిమ్మల గోపాలరావును మండల రిసోర్స్ కేంద్రంలో శనివారం సన్మానించారు. గోపాలరావు రాసిన పాత ప్రజాధరణ పొందడంపై ఎంఈఓ బి.చంద్రశేఖర్ ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం బిడ్డిక భీముడు, శ్రీశ్రీ కళావేదిక మన్యం జిల్లా ప్రెసిడెంట్ పాలక దేవానంద్, ఉపాధ్యాయులు ప్రసాద్, భగవాన్, బంటు సింహాచలం, సీఆర్‌పీలు ఉన్నారు.

ఆరోగ్యశ్రీ పథకంపై అవగాహన

సీతంపేట: ఆరోగ్యశ్రీ పథకంపై అవగాహన కల్పించాలని ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్తలు డాక్టర్ అప్పారావు, ప్రకాష్ అన్నారు. మండలంలోని వివిధ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రులతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆస్పత్రులకు వచ్చేవారికి ఈ పథకం వర్తింపచేసేలా చైతన్యం చేయాలన్నా రు. ఆరోగ్యమిత్రులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా చూడాలి

సీతంపేట: ప్రభుత్వ కార్యక్రమాలన్నీ సక్రమంగా జరిగేలా చూడాలని ఎంపీడీఓ కె.గీతాంజలి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎంఎంఎస్ కార్యాలయంలో శనివారం గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నివేదికలు, ఫోటోలు నిర్ణీత సమయంలో అప్‌లోడ్ చేయాలన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర వచ్చే నెల 10 నుంచి జనవరి 5 వరకు జరుగుతుందన్నారు. అలాగే డిసెంబర్ 4 నుంచి 13వ తేదీ వరకు సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లకు శిక్షణ ఉంటుందన్నారు. అలాగే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సమాయత్తం కావాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సత్యం పాల్గొన్నారు.

మెనూ పక్కాగా అమలు చేయాలి

- ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్



గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మెనూ పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

గుమ్మలక్ష్మీపురం: ఆశ్రమ పాఠశాలలో మెనూ పక్కాగా అమలుచేయడంతో పాటు వంటకాల్లో నాణ్యతను పాటించాలని పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ అన్నారు. మండలంలోని రేగిడి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ.. పబ్లిక్ పరీక్షల దృష్ట్యా చదువుపై దృష్టిసారించాలని సూచించారు. అలాగే ల్యాబ్‌ను పరిశీలించి సద్వినియోగించుకోవాలని విద్యార్థులతో అన్నారు. మధ్యాహ్నం భోజనంను పరిశీలించారు. అనంతరం రేగిడి పీహెచ్‌సీని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వలపై ఆరా తీశారు. గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

జర్న, సీహెచ్ బిన్నిడిలో 'వికసిత్ భారత్'



మహిళా రైతును సన్మానిస్తున్న అధికారులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని జర్న, చాపరాయి బిన్నిడి గ్రామ పంచాయతీల్లో శనివారం ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు పర్యవేక్షణలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా అధికారులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన వారికి పథకాలు వర్తింపజేసేందుకు దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ కురుపాం నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ నిమ్మక జయరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులంతా సద్వినియోగించుకోవాలని కోరారు. అనంతరం సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఐసీడీఎస్ శాఖ ద్వారా పలువురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు.

పంచగవ్య ద్రావణంతో తెగుళ్లు దూరం



పంచగవ్య ద్రావణం తయారీపై శిక్షణ ఇస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: పంచగవ్య ద్రావణంతో జీడి, మామిడి పంటల్లో సోకే తెగుళ్లను నివారించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం మండల టీం లీడర్ వై.గణేష్‌చంద్ర అన్నారు. ఈమేరకు యూనిట్ ఇన్‌ఛార్జ్ ఎం.పరశురాం ఆధ్వర్యంలో మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ ఎస్.కే పాడు గ్రామంలోని జీడిమామిడి, మామిడి తోటల రైతులకు శనివారం పంచగవ్య ద్రావణం తయారీపై అవగాహన కల్పించారు. సహజసిద్ధంగా లభించే పుల్లటి మజ్జిగ, ఆవుమూత్రం, వేపాకులు నీటితో కలగలిపి తయారు చేసుకున్న పంచగవ్య ద్రావణాన్ని ప్రస్తుత దశలో మామిడి, జీడిమామిడి తోటల్లో పిచికారీ చేసుకోవడం వలన పూతదశలో తెగుళ్లు ఆశించకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎల్విన్‌పేట సర్పంచ్ ఆర్ఎస్ చైతన్య స్రవంతి ప్రకృతి వ్యవసాయ విధానాలను రైతులంతా పాటించి అధిక దిగుబడులు పొందాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సహాయక సిబ్బంది కె.దీప, బి.నవ్య, బి.చామంతి ఉన్నారు.

రాజ్యాంగం విశిష్టతను తెలుసుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఏజీపీ జగదీష్‌కుమార్

పాలకొండ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం విశిష్టతపై యువత అవగాహన పెంచుకోవాలని న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సత్యంనాయుడు అన్నారు. ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు నేతృత్వంలో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏజీపీ చందక జగదీష్ కుమార్ మాట్లాడుతూ ఎందరో మేధావుల కృషి ఫలితంగా రాజ్యాంగం రూపుదిద్దుకుందన్నారు. ఈ క్రమంలో అంబేడ్కర్ పోషించిన కీలకపాత్రను వివరించారు. రాజ్యాంగాన్ని ప్రతీ ఒక్కరూ గౌరవించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది వై.లక్ష్మీనాయుడు, కళాశాల ఐక్యూ కోఆర్డినేటర్ బి.రాజు, అధ్యాపకులు రఘు రాఘవేంద్ర, కుమారి, శ్రీనివాసరావు తదితరులున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం



అంతకాపల్లిలో ప్రచార రథం ద్వారా పథకాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహిస్తున్న వాహనం మండలంలోని అంతకాపల్లి గ్రామం శనివారం చేరుకుంది. ఈ సందర్భంగా ఎంపీడీవో బాసూరి శంకరరావు ఎల్ఈడీ స్క్రీన్‌పై కేంద్రం అమలు చేస్తున్న పథకాల ప్రత్యక్ష ప్రసారం చేసి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కె.రాజు, ఏవో ఎం.రేణుకాసాయి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జన విజ్ఞాన వేదిక సభ్యులు

పార్వతీపురం టౌన్: రాజ్యాంగంలో పొందు పరిచిన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యుడు, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం నవంబర్ 26న పురస్కరించుకొని శనివారం పార్వతీపురం ఎస్వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. అనంతరం డాక్టర్ బ్రహ్మారెడ్డి రచించిన భారత ప్రజలమైన మేము ఈ దేశానికే యజమానులం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రశ్నించినప్పుడే బతుకులు బాగుపడతాయని తెలిపారు. సామాన్యులకు, పేదలకు నేటికీ రాజ్యాంగ, స్వాతంత్ర్య ఫలాలు అందడం లేదని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక మార్పు కోసం కృషి చేయాలని కోరారు. రాజ్యాంగ రూపకల్పనకు సంబంధించిన విషయాలు వివరించారు. కార్యక్రమంలో కవి, రచయిత గంటేడ గౌరునాయుడు మాస్టారు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు శివకేశవరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ చలపతిరావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు పి.రంజిత్ కుమార్, చంద్రమౌళి, అధ్యాపకులు గుప్త, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వితరణ



పేదలకు సాయం అందజేస్తున్న సంజీవనాయుడు

బలిజిపేట: పెదపెంకి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాలకు నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు చేతుల మీదుగా రూ.12,200 వితరణగా అందించారు. గ్రామంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలైన పి.కృపారావు, డి.సీతారాం కుటుంబాలకు సేకరించిన వితరణను శనివారం అందజేసారు. గ్రామంలో యువకులు, పెద్దల నుంచి సంజీవనాయుడు విరాళాలు సేకరించడం జరిగింది. ఈ మొత్తంలో కృపారావు కుటుంబానికి రూ.7వేలు, సీతారాం కుటుంబానకి రూ.5,200 అందించారు. వితరణలు సేకరించి నిరుపేద కుటుంబాలకు అందిస్తున్న సంజీవనాయుడును గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో యువత లక్ష్మణ్, పి.పరుశురాం, జి.శ్రావణ్, పి.తిరుపతినాయుడు, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జెండర్‌పై అవగాహన ర్యాలీ



బలిజిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

బలిజిపేట: మండల సమాఖ్య అధ్యక్షురాలు మేరీ ఆధ్వర్యంలో బలిజిపేటలో జెండర్‌పై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 25 నుంచి వచ్చే నెల 22 వరకు మహిళలకు సంబంధించిన వివిధ అంశాలపై గ్రామ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. స్త్రీ, పురుషుల సమానత్వం, గృహహింస లేకుండా చేయడం, బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయడం, మహిళలపై వేధింపుల నిరోధానికి తగిన అవగాహన ఈ కార్యక్రమం కల్పించనున్నట్టు మేరీ తెలిపారు. ర్యాలీ అనంతరం మానవహారాన్ని ఏర్పాటు చేసారు. సర్పంచ్ రాఘలత, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, ఏపీఎం ఉమామహేశ్వరరావు, సీసీలు, మహిళలు పాల్గొన్నారు.

విత్తన సేకరణలో మెలకువలు



వరిచేను కోస్తున్న రైతులు

గరుగుబిల్లి: మార్కెట్‌లో లభ్యమవుతున్న విత్తనాలలో నకిలీ, తాలుగింజలు కలుస్తుండటంతో పాటు విరివిగా లభించకపోవడంతో ఏటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేరొక రైతువద్ద కొనుగోలుచేసిన విత్తనాలపై రైతులకు పూర్తిస్థాయిలో నమ్మకం లేకపోవడంతో రైతులే నేరుగా విత్తనాలను తయారు చేసుకొనేందుకు ఆశక్తి చూపుతున్నారు. ప్రస్తుతం వరికోతలు నిర్వహిస్తున్న తరుణంలో విత్తనాల సేకరణలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి పలువిషయాలను వివరించారు. వరి విత్తనాల కోసం ఉదయం 9 గంటల తర్వాతే కోతలను ప్రారంభించాలన్నారు. సాధ్యమైనంతవరకు విత్తనాలకోసం కోసిన పంటను ట్రాక్టర్లతో తొక్కించకుండా బల్లపై కొట్టడంద్వారా సేకరించడం మంచిది. తాలు గింజలు, కేళీలు లేకుండా విత్తనాలను శుభ్రంచేసుకోవాలన్నారు. విత్తనాలను సేకరించే ముందు ధాన్యంను 16 శాతం తేమ ఉండేలా ఆరబెట్టుకోని, నిల్వ చేసుకోవాలన్నారు. వరివిత్తనాలను నిల్వచేసేముందు సంచులను పోలిడిన్ మందును వేసి శుభ్రం చేసుకోవాలన్నారు. విత్తనాలను నింపిన సంచులను నేలమీద కాకుండా తడి తగలని ప్రదేశంలో భద్రపరుచుకోవాలన్నారు. ఈ విధంగా పలుజాగ్రత్తలు తీసుకోవడం వల్ల మంచి నాణ్యమైన విత్తనాలు తయారు చేసుకొనేందుకు అవకాశం వుంటుంది.

ఆందోళనలో అన్నదాత



పెద్దూరులో కోసిన పంటను పొలాలలో కుప్పగా పెడుతున్న రైతులు

గరుగుబిల్లి: ఖరీఫ్ రైతుల గుండెల్లో వాయుగు(గ)ండం నెలకొంది. పంట చేతికొచ్చే సమయంలో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకోవడంపై ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఎస్ఆర్‌పేట, పెదగుడబ, చినగుడబ, వల్లరగుడబ, బురద వెంకటాపురం, పెద్దూరు, దళాయివలస, నాగూరు, ఉల్లిభద్ర, గొట్టివలస తదితర గ్రామాల్లో సుమారు 8 వేల ఎకరాల్లో వరిపంట కోతదశకు చేరుకుంది. ఇప్పటికే పలువురు రైతులు పంటకోతలు చేపట్టగా.. మరికొందరు కోసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సమయంలో తుపాను పొంచి ఉందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరికలు చేయడంతో చేతికందివచ్చిన పంటను కాపాడుకునేందుకు రైతులు ప్రయత్నాలు ముమ్మరం చేశా రు. కోసిన పంటను చిన్నచిన్న కుప్పలుగా పెట్టి వర్షానికి తడిచిపోకుండా టార్పాలిన్లతో కప్పుతుండగా.. కొందరు పంటకోతలు వాయిదా వేసుకుంటున్నారు. పంటకోత ఆలస్యమైతే గింజలు రాలిపోయే అవకాశం ఉందని, కోస్తే వర్షాలకు తడిచిపోయి పాడయ్యే ప్రమాదం ఉందని వాపోతున్నారు.